టీటీడీ ఉద్యోగులకు దర్శన భాగ్యం కల్పించాలి

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండుసార్లు జరుగుతున్న నేపథ్యంలో టీటీడీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలకు రెండు దఫాలు దర్శన సౌకర్యం కల్పించాలని టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి కె. గుణశేఖర్ టీటీడీ ఇఓ ధర్మారెడ్డికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తమ సంఘం తరపున టీటీడీ ఇఓ, సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించామని ఆ ప్రకటనలో తెలిపారు. టీటీడీ ఉద్యోగుల కుటుంబాలకు గత ఏడాది లాగానే 300 రూపాయల టికెట్లను కుటుంబానికి 10 మందికి చొప్పున అన్ని కుటుంబాలకు రెండు దఫాలు బ్రహ్మోత్సవాలలో అవకాశం కల్పించాలని ఆయన కోరారు.



అర్జీలను తీసుకుంటున్న కలెక్టర్

సమస్యలన్నీ జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'ప్రజా సమస్యలన్నింటిని జగనన్నకు చెబుదాం' అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ప్రజల వద్దకే పాలన అన్న లక్ష్యంతో సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా మండలాల్లో విడతల వారీగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలు సమర్పించే ప్రతి అర్జీకి ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరిస్తుందని తెలిపారు. సమస్య, పరిష్కారం, పరిష్కారానికి అయ్యే సమయాన్ని సైతం అర్జీదారుకి తెలియజేస్తామని వివరించారు. సమస్య పరిష్కారమైనా, కాకున్నా అర్జీదారుడి అభిప్రాయాన్ని సచివాలయ సిబ్బంది పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. అర్జీదారుడు సంతప్తి వ్యక్తం చేయకపోతే ఆ సమస్యను తిరిగి స్వీకరిస్తామని చెప్పారు. గత మేలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 217 అర్జీలు రాగా 212కు పరిష్కారం చూపామనీ, పది అర్జీలను తిరిగి ఓపెన్ చేశామని వివరించారు. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆర్డీవో రామారావు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

కీర్తి కుటుంబాన్ని ఆదుకుందాం

ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు, శ్రీసిటీ రూ.50వేలు అందజేత

ప్రజాశక్తి - పిచ్చాటూరు

తాను మరణించినా, తన అవయవాలతో ఏడుగురికి పునర్జన్మనిచ్చిన కీర్తి కుటుంబాన్ని మరోసారి కీర్తించారు. పిచ్చాటూరు మండలం రామాపురం దళితవాడకు చెందిన సి.సంపత్‌కుమార్, అమ్ములు దంపతులకు సిఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.5 లక్షల చెక్కును బుధవారం ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం అందజేశారు.



చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ ఆదిమూలం

ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అవయవదానం చేసిన కీర్తి విషయం తనకు తెలిసిన వెంటనే సిఎం కార్యాలయంతో నేరుగా సంప్రదించి సిఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఐదు లక్షల రూపాయల చెక్కును మంజూరు చేయించినట్లు చెప్పారు. ఓ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన యువతి మరణిస్తూ సైతం మరో ఏడుగురికి ఊపిరి పోసిందని, కీర్తి స్ఫూర్తి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఉండటానికి కనీసం సక్రమమైన ఇల్లు లేకపోయినా పిల్లల చదువుల కోసమే ఆ తల్లిదండ్రులు కష్టపడ్డారని, చేతికంది వచ్చిన కీర్తి ప్రమాదవశాత్తు మృతిచెందడం ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. అవయవదానంతో వారు చూపిన మార్గం ఎందరికో మార్గదర్శకమన్నారు. చెన్నై జీహెచ్ వైద్యులు కీర్తి శరీరం నుంచి గుండె, రెండు మూత్రపిండాలు, రెండు కళ్లు, గుండె వాల్వు, కాలేయం, మూత్రనాళాలు, ఊపిరితిత్తులను అవయవ దానం ద్వారా స్వీకరించి ఏడుగురికి అమర్చారన్నారు. 18 సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత ఎవరైనా అవయవ దానం కోసం తమను తాము నమోదు చేసుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా శ్రీ సిటీ తరపున 50 వేల రూపాయలు శ్రీ సిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి సౌజన్యంతో కీర్తి కుటుంబానికి అందించామన్నారు... ఇంకా మనసున్న మారాజులు స్పందించి కీర్తి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ఆదిమూలం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, పార్టీ అధ్యక్షుడు చాలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ రమేష్ రాజు, తొప్పయ్య, మోహన్, సుబ్రమణ్యం రెడ్డి, బాబు రెడ్డి పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించకనే..!

ఫొటోలకు ఫోజులిచ్చిన అధికారులు

ప్రజాశక్తి -తొట్టంబేడు

సమస్య పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు అధికారులు ఫోటోలకు ఫోజులివ్వడం విమర్శలకు తావిస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తొట్టంబేడు మండలం చోడవరంలో మురుగునీరు వీధుల్లో నిల్వచేరుతోంది. దీంతో గ్రామస్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై బుధవారం పత్రికల్లో కథనం ప్రచురితమైంది. ఈ కథనాలపై స్పందించిన తొట్టంబేడు ఎంపీడీవో సురేష్ బాబు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి సమస్య పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఆనంద్ బాబు, మరో కార్యదర్శి సింధూజ, మహిళా పోలీసు త్రివేణి, వెల్ఫేర్ అసిస్టెంటు రాజశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంటు అశోక్ స్థానిక సర్పంచ్ వెంకట్రమణారెడ్డితో కలసి చోడవరంలో గ్రామ సభ నిర్వహించారు. ఓ కుటుంబం వారు కాలువకు అడ్డంగా మట్టి తోలి పూడ్చి వేయడంతో మురుగు నీరు వీధుల్లో నిల్వ చేరుతోందని... అదేవిధంగా ఓ వ్యక్తి పంట కాలువ ఆక్రమించు కోవడం కూడా ఈ సమస్య వస్తోందని గ్రామస్థులు గ్రామ సభలో ఫిర్యాదు చేశారు. ఈ సమస్య పరిష్కరించడానికి అధికారులు సరైన హామీ ఇవ్వలేదు. అయితే చోడవరంలో మురుగు కాలువకు అడ్డంగా తోలిన మట్టిని తొలగించామని... ఇకపై ఇక్కడ సమస్య ఉండదంటూ సీనియర్ పంచాయతీ కార్యదర్శి ఆనంద్ బాబు పేరున పత్రికలకు ప్రకటన జారీ చేశారు. ప్రజాశక్తి క్షేత్ర స్థాయిలో విచారించగా అధికారులు చేసిన ప్రకటన వాస్తవం కాదన్నారు. అధికారులు ఇలా ఎందుకు ప్రకటన ఇచ్చారో తమకు అర్థం కావడం లేదని చోడవరం వాసులు అంటున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి ఈ మురుగు నీటి సమస్యను పరిష్కరించ వలసి ఉంది. అదేవిధంగా ఆక్రమణకు గురైన పంట కాలువకు విముక్తి కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.




మురుగు సమస్య యథాతథం

రుయా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి:సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారామెడికల్, నాల్గవ తరగతి ఉద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఉదయం రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభుకు సిఐటియు అధ్వర్యంలో ఉద్యోగులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ రుయాలో పని చేస్తున్న ఉద్యోగుల సీనియారిటీ లిస్టు ప్రకటించాలని, నాలుగవ తరగతి ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం విద్యార్హతలను బట్టి ప్రమోషన్లు, కన్వర్షన్ లు ఇవ్వాలని, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఎమర్జెన్సీ వార్డుల అవసరాలకు అనుగుణంగా స్ట్రెచర్ బేరర్స్ ను నియమించాలని కోరారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న ఎంఎన్‌ఓలు, ఓటి అసిస్టెంట్లుగా డిప్యుటేషన్ లో ఉన్న ఉద్యోగులను, వారిని తీసుకున్న పోస్టులలో



వినతిపత్రం ఇస్తున్న నేతలు

కొనసాగించాలని డిప్యూటేషన్లు రద్దు చేయాలని కోరారు. అన్ని వార్డులకు ఇండెంట్ తీసుకురావడానికి ఉద్యోగులను కేటాయించడం, ప్లంబర్ పోస్టులను భర్తీ చేయటం, ఫిమేల్ సర్జరీ వార్డులకు ఫిమేల్ బార్బర్ లను నియమించాలని కోరారు. మేల్ సర్జరీ వార్డులకు మేల్ బార్బర్ నే నియమించాలని, పెండింగ్ లో ఉన్న ఇంక్రిమెంట్లు, పిఆర్సీని తక్షణం అమలు పరచాలని, నాలుగవ తరగతి ఉద్యోగులకు, ఆప్కాస్ ఉద్యోగులకు క్యాజువల్ లీవులు, డే ఆఫ్ లు, హెల్త్ సూపర్వైజర్ ద్వారానే మంజూరు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు, ఆప్కాస్ ఉద్యోగులకు యూనిఫామ్, గుర్తింపు కార్డులను ఇవ్వాలని, అన్ని క్యాడర్ లలోని ఉద్యోగులకు ప్రోత్సాహక ఆరోగ్య శ్రీ రుసుమును ఇవ్వాలని, ప్రతి నెలా పేస్లిప్పులు ఇవ్వాలని వినతిపత్రం లో కోరారు. తన పరిధిలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తానని రుయా సూపరింటెండెంట్ నేతలకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె. వేణుగోపాల్, రుయా హాస్పిటల్ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎన్. సుబ్రహ్మణ్యం, కార్యదర్శి బి. గురవయ్య, ప్రధాన కార్యదర్శి ఏ. నరసింహులు, ముని చంద్ర, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పోస్టుకార్డు ఉద్యమం

కుప్పంలో ప్రైవేట్ వైద్యుల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మాజీ సిఎం చంద్రబాబునాయుడు రిమాండ్ నుంచి విడుదల కావాలంటూ బుధవారం టిడిపి ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేశారు. మాజీ ఎంఎల్ఎ మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో వినాయక పూజ నిర్వహించి పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. సుగుణమ్మ, నర్సింహయాదవ్ మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో, క్లీన్‌చిట్‌తో బయటకు వస్తారన్నారు. నాయకులు వూక విజయ్‌కుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ పాల్గొన్నారు.



పోస్టుకార్డుల ప్రదర్శన

కుప్పంలో... 'బాబుతో మేము సయితం' అంటూ ప్రైవేట్ డాక్టర్లు సురేష్, ప్రశాంత్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. చంద్రబాబుపై అవినీతి బురద చల్లాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తేజస్విని, ప్రియ, హేమంత్, మోనిషా, తిలక్, దేవేంద్ర పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో.. చంద్రబాబుపై అవినీతి మరకలు అంటించడం ఎవరి తరమూ కాదని, కడిగిన ముత్యంలా బయటకు వస్తారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాలి గోపీనాథ్ అన్నారు. ఎంఎల్ఎ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇ.హేమగిరి మేముసైతం బాబుతో కరపత్రాలను పంపిణీ చేశారు.

ఇంజినీరింగ్‌తో అవకాశాలు మెండు:ఎన్.ఎన్.మూర్తి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

నేడు సాంకేతికతకు ఆదరణ, అవకాశాలు బాగున్నాయని, ఇంజినీరింగ్ విద్యతో భవిష్యత్తులో అవకాశాలు మెండుగా ఉన్నాయని తిరుపతి ఐఐటి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.ఎన్.మూర్తి అన్నారు. బుదవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈసిఈ విభాగంలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఎన్.ఎన్.మూర్తిని సత్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి

ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.ఎన్.మూర్తి మాట్లాడుతూ కరోనా మునుపు ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, చిప్స్ వంటి వాటి కోసం చైనా దేశంపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. కాని నేడు మన భారతదేశంలోనే తయారు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో భవిష్యత్తులో ఈసిఈ విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యకు ఏపిలోనే కేరాఫ్‌గా ఎస్వీసిఈ నిలుస్తోందన్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఎన్నో సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కళాశాల ఛైర్మన్ గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవవరం పాల్గొన్నారు.

విలేకరి కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చంద్రగిరి సీనియర్ పాత్రికేయుడు ఆవుల నాదముని యాదవ్ ఆకస్మిక మతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని తిరుపతి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర అన్నారు. బుధవారం చంద్రగిరి మండలం పనపాకం గ్రామంలో నాదముని యాదవ్ స్వగహం వద్ద పెద్దకర్మ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ప్రెస్‌క్లబ్ సభ్యులు కలిసి పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ తరఫున కార్యదర్శి బాలచంద్ర, సభ్యులు మహేష్ 10 వేల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు పాటూరు కన్నయ్య, లీలాకష్ణ, గల్లా సుబ్రహ్మణ్యం, నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలలో ఎలుగుబంటి హల్‌చల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమలలో మరోసారి ఎలుగుబంటి హల్ చల్ చేసింది. అలిపిరి నడక మార్గంలోని ఏడో మైలు వద్ద మంగళవారం రాత్రి ఎలుగుబంటి సంచరించడం భక్తుల కంట పడింది. ఎలుగు బంటి సంచారాన్ని గుర్తించిన నడక మార్గంలోని సెక్యూరిటీ సిబ్బంది అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

ఇప్పటికీ తిరుమలలో ఆపరేషన్ చిరుత కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే 5 పులులను పట్టుకున్న అధికారులు కాలి నడకన తిరుమల చేరే భక్తులు చిరుతల గురించి భయపడాల్సిన పనిలేదు అనిభరోసా ఇచ్చారు. తాజాగా బుధవారం ఆరో చిరుత బోనుకు చిక్కింది. తాజాగా తిరుమలలో ఎలుగుబంటి సంచారాన్ని గుర్తించారు. మంగళవారం రాత్రి 12:30 గంటల సమయంలో అలిపిరి నడక మార్గంలోని నరసింహ స్వామి ఆలయం వద్ద ఫుట్ పాత్ పై ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. చాలా సమయం వరకు ఎలుగు బంటి నడక మార్గంలోనే ఉన్నది. కాగా ఆ సమయంలో భక్తుల సంచారం లేదు. డిఎఫ్ఓ చంద్రశేఖర్ ఈ ఘటన పైన స్పందిస్తూ 11.45 గంటకి లాస్ట్ బ్యాచ్ భక్తులు తిరుమల చేరుకున్నారు. కాగా 12:30 గంటలకి ఎలుగుబంటి సంచరించింది. తిరుమల గిరులపైన వన్య ప్రాణుల సంచారం సర్వసాధారణం అని వెల్లడించిన ఆయన భక్తుల భద్రత దష్ట్యా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసాం అని పేర్కొన్నారు.

బోనులో చిక్కిన ఆరో చిరుత

ఎఫ్ఎంఎస్ కార్మికులకు లడ్డూ వడ ఇవ్వాలి

తిరుపతి టౌన్ : బ్రహ్మోత్సవాల్లో పనిచేసిన వారికి లడ్డూ వడ ఇవ్వాలని ప్రొసీడింగ్స్ విడుదల చేశారని, అయితే అందులో ఎఫ్ఎంఎస్ కార్మికుల గురించి ప్రస్తావన లేదని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. టిటిడి యాజమాన్యం ఎఫ్ఎంఎస్ కార్మికుల పట్ల వివక్ష పాటించడం సరైంది కాదన్నారు.

'గోవింద కోటి' పుస్తకాల పంపిణీ

వినాయకసాగర్‌లో ప్రత్యేక పూజలు / జిల్లావ్యాప్తంగా వినాయక నిమజ్జనం / తిరుపతిలో 8 లక్షలకు అమ్ముడుపోయిన లడ్డు



గోవింద కోటి పుస్తకాన్ని అందిస్తూ..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ , యంత్రాంగం

తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి తొలి సమావేశంలోనే ప్రవేశ పెట్టిన గోవింద కోటి లిఖిత కార్యక్రమం ఆచరణలోకి తేవడానికి బుధవారం తొలి అడుగుపడింది. వినాయక సాగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి సాక్షిగా శాసన సభ్యులు, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి భక్తులకు గోవింద కోటి పుస్తకాలు పంపిణీ చేశారు. విఘ్నాలను హరించే వినాయకుడే గోవింద కోటి రాస్తున్నట్లుగా తయారు చేసిన విగ్రహం ఎంతగానో ఆకట్టుకుంది. నగర మేయర్ డాక్టర్ శిరీష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, గోవింద కోటి వినాయక విగ్రహ కాన్సెప్టర్ కిషన్ పాల్గొన్నారు.

భక్తి ఉద్యమంలా వినాయక చవితి

వినాయక చవితిని భక్తి ఉద్యమంగా మార్చిన వినాయక నిమజ్జన కమిటీకి టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. తిరుపతి నగరంలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరియాలని, రాబోయే రోజుల్లో మరింత గొప్పగా వినాయక చవితి వేడుకలు, నిమజ్జనం నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వినాయక విగ్రహం నెలకొల్పి ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించిన మేయర్ డాక్టర్ శిరీషను, కమిషనర్ హరితకు అభినందనలు తెలిపారు. వినాయక నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో విగ్రహాలకు హారతులు ఇచ్చి స్వాగతించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించారు. కార్పొరేషన్‌లోని లడ్డూ ప్రసాదాన్ని ఈ ఏడాది మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్ జనార్ధన్ రెడ్డి వేలంలో ఎనిమిది లక్షలకు పాడుకుని దక్కించుకున్నారు.

తిరుపతి శెట్టిపల్లి గ్రామంలో యువత వినాయక ఉత్సవాల్లో భక్తిభావంతో మెలగాలని అలిపిరి సిఐ అబ్బన్న, ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులు వెంకయ్యస్వామి ఆలయ సమీపంలోని జర్నలిస్టు కాలనీలో బుధవారం అన్నదానం చేశారు. విష్ణు, చాముండేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్.రవి, వెంకటేశ్వర్లు, విష్ణు, సుబ్రమణ్యం, నాగరాజు, వలిపి శ్రీరాములు, దొరబాబు పాల్గొన్నారు. బిఎన్ కండ్రిగ బీసీ కాలనీలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బొర్రా వేణు కుటుంబం, జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల ఆంగ్లభాష ఉపాధ్యాయులు రాకేష్, లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రశేఖర్, వెన్నెల, ధనంజయులు, మణెమ్మ ఆధ్వర్యంలో 15వేల రూపాయలకు లడ్డూ ప్రసాదాన్ని వేలం పాటలో పాడుకున్నారు. వెంకటగిరిలో కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆధ్వర్యంలో ఉట్టి కొట్టారు. తిరుచానూరు సర్పంచి కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రేణిగుంట పట్టణంలోని



శ్రీకాళహస్తి జర్నలిస్టు కాలనీలో అన్నదానం



లడ్డూ వేలం వేస్తూ...

జిఎం స్ట్రీట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ వద్ద బుధవారం దరియా అనీల్‌కుమార్, సుమశ్రీలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. అతిథులను అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్, ముఖ్య సలహాదారులు జూలియన్‌రాజు శాలువాతో సన్మానించారు. రేణిగుంట బుగ్గవీధిలో వినాయకుని విగ్రహాన్ని రష్ ఆస్పత్రి అధినేత, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం దర్శించుకున్నారు. పాకాలలోని డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వినాయక చవితి పూజలో ఉపయోగించే పత్రిపై మినీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించామని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మెహిద్దీన్‌బాష ఓ ప్రకటనలో తెలిపారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోహన్ బెహరా పాల్గొన్నారు. గూడూరులో దిగువ వీరారెడ్డిపల్లి యూత్ ఆధ్వర్యంలోవ ఇనీష్ యాదవ్ సహకారంతో జరిగింది. లడ్డు వేలం పాటలో మామా అల్లుళ్లు దుగ్గన అఖిల్ కుమార్ యాదవ్, నాలి మధుసూదన్‌యాదవ్‌లు 45వేల ఒక్క రూపాయికి దక్కించుకున్నారు. వినాయకుని నిమజ్జనంలో జాగ్రత్తలు తీసుకోవాలని గూడూరు రూరల్ సిఐ డి.దశరథ రామారావు సూచించారు.

ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ఫిష్ ఆంధ్రా ప్రారంభం

రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించేలా అన్ని ప్రముఖ నగరాల్లో అందుబాటులోకి తీసురావాలని, రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా...ఫిట్ ఆంధ్రా నినాదంతో ఫిష్ హబ్ లను ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. బుధవారం తిరుపతి నగరంలో రాష్ట్రంలోనే మొదటి ఫిష్ ఆంధ్రా లాంజ్ కు శ్రీకారం చుట్టామని నగరపాలక మేయర్ డా.శిరీషా అన్నారు. బుధవారం ఉదయం స్థానిక మంగళం రోడ్డు, శ్రీరాం నగర్ వద్ద ఫిష్ ఆంధ్రా లో భాగంగా లబ్దిదారు భావనా జ్యోతి కొత్తగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా లాంజ్ (చేపల అమ్మకం, రెస్టారెంట్) ను నగరపాలక మేయర్ శిరీష, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి లు సంయుక్తంగా ప్రారంభిచారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2.12 లక్షల హెక్టార్ లలో ఆక్వా సాగు జరుగుతోందని, ఈరంగంపై మొత్తం 1.38 లక్షల మంది రైతులు ఆధారపడి ఉన్నారని , 2.27 మెట్రిక్ టన్నుల ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలోనే మనరాష్ట్రం మొదటి స్థానంలో వుందని అన్నారు. అలాగే మన జిల్లాలో 75 కిమీ సముద్ర తీర ప్రాంతం, 70 వేల మంది ఆక్వారంగం పై ఆధార పడివున్నారని అన్నారు. దాదాపు మన జిల్లాలో ఆక్వాసాగు చూస్తే 2381 హెక్టార్ల పైగా వుందని అన్నారు. మన తలసరి ఆక్వా ఉత్పత్తుల వినియోగం కేవలం 7 కేజీలు గా వుందని, అత్యంత పోషక విలువలు చేపలందు వున్నాయని, ఆరోగ్యవంతగా వుండాలంటే నిపుణుల సూచనలమేరకు కనీసం 25 కేజీల తలసరి వినియోగం రావాలని అన్నారు. భావనజ్యోతి మాట్లాడుతూ మహిళా కోటా కింద మంజూరు జరిగిందని, రూ.50 లక్షల యూనిట్ విలువ రూ.30 లక్షల సబ్సిడీ , రూ.1.50 లక్షల పెట్టుబడితో బ్యాంక్ ఆఫ్ బరోడా రుణంగా రూ. 6.50లక్షలు అందిందని, తిరుపతి నగరంలో ఒక మంచి చేపలు, రొయ్యలు వంటివి అమ్మకంతో పాటు రెస్టారెంట్ ఏర్పాటు చేసామని ఆరోగ్యకర ఆక్వా ఉత్పత్తులను నేటినుండి అమ్మకాలు , రెస్టారెంట్ ప్రారంభించిన అందుబాటులోకి తీసురావడానికి ప్రోత్సహించిన అధికారులకు ధన్యవాదాలని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప మేయర్ ముద్రనారాయణ , జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస నాయక్ , ఎస్.వి.యు ఆక్వాకల్చర్ హెడ్ నాగజ్యోతి, హబ్ ఆపరేటర్ రాజ రెడ్డి పాల్గొన్నారు.

రొచ్చు రహదారులకు మోక్షం

- ఎమ్మెల్యే ఆదిమూలం చొరవ -స్థానికుల ఆనందం



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ : సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం సంతవేలూరు పంచాయతీ సాధనవారిపాలెం ప్రజలకు ఎట్టకేలకు రహదారి కష్టాలు తీరాయి. బీఎన్ కండ్రిగ బిసుల్లురు పేట రహదారి నుంచి సాధనవారిపాలెం గ్రామానికి వెళ్లే రహదారి దశాబ్దాల కాలంగా అడుగడుగున గుంతలతో వర్షాలకు రొచ్చురొచ్చుగా మారి ప్రజల రాకపోకలు నిత్యం నరక ప్రాయంగా మారింది. గ్రామస్తుల విన్నపం మేరకు ఇటీవల ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రహదారిని పరిశీలించి తొలుత మరమ్మతులు చేపట్టిన అనంతరం తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ మేరకు గత రెండు రోజులుగా రహదారి మరమ్మతులు పనులు వేగంగా సాగుతున్నాయి. రహదారిలో గుంతలు పూడ్చి జెసిబితో చదును చేశారు. సాధనవారిపాలెం రహదారికి ఎట్టకేలకు గ్రావెల్ మట్టితో మరమ్మతులు చేపట్టడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంచేసిన కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు తెలిపారు.

నకిలీ డీఎస్‌పీ అరెస్టు

- ఉద్యోగాల పేరిట రూ. 30 లక్షలు టోకరా
- రూ. ఏడు లక్షల ఆస్తి పత్రాలు స్వాధీనం
- కేటుగాళ్ల చేతిలో మోసపోవద్దు
- యువతకు డీఎస్‌పీ పిలుపు

ప్రజాశక్తి - గూడూరు : గూడూరు పట్టణ సీఐ హజరత్ బాబు నకిలీ డీఎస్పీని అదుపులోకి తీసుకున్నారు. రైల్వే డీఎస్పీనని ఉద్యోగాలిప్పిస్తానని మోసం చేస్తున్న మందా నాగరాజు అనే వ్యక్తిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. ఆయన అనేక పాత కేసులలో నిందితుడిగా ఉన్నాడు. ఈ సందర్భంగా డీఎస్పి ఎం. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆరు నెలలుగా రైల్వే డీఎస్పీ అంటూ రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చాలామందిని నాగరాజు నమ్మించాడన్నారు. నిరుద్యోగ బాధితుల నుండి రూ. 30 లక్షలు వసూలు చేశాడన్నారు. ఫేక్ నియామక పత్రాలు సృష్టించాడన్నారు. డూప్లికేట్ ఫిజికల్ ఫిట్ నెస్ సర్టిఫికెట్ లు సైతం సృష్టించి నిరుద్యోగులను బురిడీ కొట్టించాడని తెలిపారు. వసూలు చేసిన నగదుతో ల్యాప్ టాప్, వాకీటాకి, యూనిఫాం దుస్తులు కొనుగోలు చేశాడన్నారు. గూడూరులో నాజినీ అనే మహిళ రాజారెడ్డితో సహజీవనం చేస్తూ వేరైన క్రమంలో రాజారెడ్డి వద్ద నుండి నగదు రావాల్సి ఉండగా నాజినీ రైల్వే డీఎస్పీగా పరిచయం చేసుకున్న నాగరాజును కలిసింది. దీంతో నాగరాజు, రాజారెడ్డిని బలవంతంగా కారు ఎక్కించుకుని జనావాసాలు లేని ప్రాంతంలో ఎన్ కౌంటర్ చేస్తానని బెదిరించి పది రోజులలో పది లక్షల రూపాయలు ఇవ్వాలని సంతకాలు చేయించాడు. రాజారెడ్డి పోలీసులను ఆశ్రయించడంతో నకిలీ డీఎస్పీ బాగోతం బయటపడిందన్నారు. అతని వద్ద నుండి ఏడు లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన స్థల ధృవీకరణ పత్రాలు, వాకీ టాకీ, ఐదు స్మార్ట్ ఫోన్లు, లాఠీ, ఐడెంటిటీ కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. యువత స్వశక్తిని నమ్ముకోవాలని, ఇటువంటి కేటుగాళ్ల చేతుల్లో మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు హజరత్ బాబు, రైల్వే సీఐ లక్ష్మణ్ రావు, ఏఎస్ఐ సీకేఎన్. రావు, ఒకటవ పట్టణ ఎస్ఐ పవన్ పాల్గొన్నారు.





పోలీసుల అదుపులో నకిలీ డీఎస్‌పీ నాగరాజు

ఉచిత వైద్యశిబిరం



ఉచిత మందులు అందిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని న్యూ బాలాజీ నగర్‌లో లయన్స్ క్లబ్ గూడూరు , న్యూ బాలాజీ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజేష్ డాక్టర్ సుగుణమ్మ హాజరై వివిధ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా పేదలు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. లయన్స్ క్లబ్ పేదల విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తుందన్నారు. అందులో భాగంగానే న్యూ బాలాజీ నగర్ యూత్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం డాక్టర్ సుగుణమ్మ మాట్లాడుతూ ఇంకా ఎన్నో ఇలాంటి కార్యక్రమాలు లయన్స్ క్లబ్ గూడూరు వారితో కలిసి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్ రవిచంద్ర, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్లు వాకాటి రామ్మోహన్, సీనయ్య, ట్రెజరర్ వీరేంద్రనాథ్, దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌గా కె చలపతి రాజు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండల వైసిపి అధ్యక్షులుగా కె చలపతి రాజును రాష్ట్ర నాయకత్వం నియమించింది. మండలంలోని వైసిపి ఎంపిటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతి నిధులు పార్టీ కొత్త అధ్యక్షున్ని సన్మానించారు. ఈ సందర్భంగా చలపతి రాజు మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్ తనపై నమ్మకం ఉంచి పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి వైసిపి కార్యకర్త నుంచి నాయకులు దాకా కలిసికట్టుగా పనిచేస్తూ వైసిపి అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించే విధంగా కృషి చేస్తూ పార్టీని బలోపేతం చేసుకుంటూ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, ఎంపిటీసీ రమేష్ రాజు, తొప్పయ్య, మోహన్ , సుబ్రహ్మణ్యం రెడ్డి, బాబు రెడ్డి, చెంగలరాయ్ రెడ్డి, కిరణ్ కుమార్, వెంకటేష్, పాల పద్మనాభం, చంద్రన్, గోవిందస్వామి, శేఖర్, నాగరాజు పాల్గొన్నారు.



చలపతి రాజును సన్మానిస్తున్న వైసిపి నాయకులు

కార్తీక్ రెడ్డికి సన్మానం



ప్రజాశక్తి - బాలాయపల్లి : కార్తీక్‌రెడ్డికి వైసిపి మండల అధ్యక్ష పదవి వచ్చిన సందర్భంగా వైసిపి నాయకులు రాయి దేవిక చౌదరి ఆయనకు బుధవారం పుష్పగుచ్చం అందించి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం లోని కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఎంజీఎంలో విజయవంతంగా జీఓపి సర్జరీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని స్థానిక ఎంజీఎం హాస్పిటల్లో అరుదైన గ్యాస్ట్రిక్ అవుట్ లెట్ అబ్స్ట్రక్షన్ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి శస్త్ర చికిత్సను విజయ వంతంగా పూర్తి చేసి ప్రాణాలు కాపాడారు. కేవీబీపురం మండలానికి చెందిన బాబు తీవ్రమైన కడుపు నొప్పితో ఈ నెల 8న ఎంజీఎం ఆసుపత్రిలో చేరాడు. రోగికి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు సర్జరీ చేయాలని నిర్ణయించారు. గుండె వైద్య నిపుణులు వివేక్ చైతన్య పర్యవేక్షణలో డాక్టర్ శివకిషోర్ అరుదైన గ్యాస్ట్రిక్ అవుట్ లెట్ అబ్స్ట్రక్షన్ ఆపరేషన్ పూర్తి చేసి ప్రాణాలను కాపాడారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయ వంతంగా పూర్తి చేసి రోగి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు.



ఎబిసిడి వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలి

ప్రజాశక్తి -వెంకటగిరి : ఎబిసిడి వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించా లని ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద మందకృష్ణ మాదిగ అధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈధర్నను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ ప్రజాసంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గద్దల మునెయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 29వ సంవత్సరాల నుంచి మాదిగలు చేస్తున్న పోరాటాలు గుర్తించి ఈ పార్లమెంట్ సమావేశాలలో ఏబిసిడి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాజ్యసభ సభ్యులు బిసి జాతీయ నాయకులు కృష్ణయ్య ను కలిశారు.





పళనిస్వామిని కలిసిన జయశ్యామ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళని స్వామిని ట్రస్ట్ బోర్డు సభ్యులు జయశ్యామ్ రాయల్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం నిమిత్తం పళని స్వామి రేణిగుంట రైల్వే స్టేషన్ కు చేరుకోగా జయశ్యామ్ ఆయనకు స్వాగతం పలికి వసతి ఏర్పాట్లు చేశారు.

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం : వీసి ఆచార్య డి భారతి



ప్రజాశక్తి - క్యాంపస్ : దేశ చరిత్రలో పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదించడం 2023వ సంవత్సరం చరిత్రలో లిఖించదగిందని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి భారతి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపే అభినందన సభను పరిపాలన భవనం ఎదుట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదించడంపై శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హర్షం వ్యక్త పరిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలుపుతూ మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ నిజంగా సెప్టెంబర్ 19 మహిళా సమాజానికి ఒక చారిత్రాత్మక దినమని, చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లు ఆమోదం వల్ల లోక్ సభ, రాష్ట్రాల శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు అవుతాయన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, రాజకీయాలలో మహిళల ప్రాతినిధ్యం, స్వయం నిర్ణయాధికారం పెరిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యపడుతుందని, లింగ అంతరాన్ని రూపుమాపవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ అనురాధ స్వాగతం పలకగా, సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుజాత, ఐక్యూఏసి డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపుర సుందరి, లైబ్రరీ డీన్ ప్రొఫెసర్ వాణి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కాత్యాయని, కన్సల్టెన్సీ డైరెక్టర్ ప్రొఫెసర్ శారద, ప్రొఫెసర్ సీతా కుమారి, ప్రొఫెసర్ నిర్మల, ప్రొఫెసర్ మధ్య జ్యోతి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీయ అనుభవాల కోసమే ఇండక్షన్ ప్రోగ్రాం

- ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆచార్య పి మల్లికార్జున



ప్రజాశక్తి- క్యాంపస్ : విద్యార్థినులకు స్వీయ అనుభవాల కోసమే ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో 2023 ఆగస్టు 31 నుండి బి.టెక్ కోర్సు (2023 బ్యాచ్) కోసం కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థుల కోసం ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు వారాల ఇండక్షన్ ప్రోగ్రామ్ లక్ష్యం విద్యార్థులు కొత్త వాతావరణంలో ఉంటారని, ఉపాధ్యాయులు , విద్యార్థులతో మంచి సంబంధాలు ఏర్పరచుకోవడానికి, సంస్థ నైతికత, సంస్కృతిని పెంపొందించడానికి, విద్యార్థులను స్వీయ-అన్వేషణ భావాన్ని బహిర్గతం చేయడానికి ఉపయోగ పడుతుందన్నారు. ఇండక్షన్ ప్రోగ్రామ్ లో భాగంగా యోగా, ధ్యానం వంటి రోజువారీ కార్యకలాపాలు, క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు వంటి శారీరక కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇండక్షన్ ప్రోగ్రామ్ సమయంలో విద్యార్థులు మహిళల చట్టం, పోషకాహారం, భారతీయ సంస్కృతి, వారసత్వం, సార్వత్రిక మానవ విలువలు, డిజైన్ థింకింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌లు ప్రముఖ వ్యక్తు లచే నిర్వహించే అతిథి ఉపన్యాసాలకు సరైన మార్గం నిర్దేశకత్వం సూచిస్తాయన్నారు. అనేక లైఫ్ స్కిల్స్, ఇంగ్లీష్ డయాగ్న స్టిక్ టెస్ట్, లిటరరీ ఈవెంట్స్, ఆప్టిట్యూడ్ మరియు మ్యాథ మెటికల్ స్కిల్స్ వర్సిటీ వివిధ విభాగాలు నిర్వహిస్తాయన్నారు. విద్యార్థులు యూనివర్సిటీ లైబ్రరీ, లాబొరేటరీలు, వర్సిటీలోని ఇంక్యుబేషన్ సెంటర్లు, చంద్రగిరి కోట, ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం వంటి స్థానిక ల్యాండ్‌మార్క్‌లు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఇండక్షన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఏ హరిత, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకులకు ప్రాధాన్యత ఇవ్వండి: నేదురుమల్లి

ప్రజాశక్తి - బాలాయపల్లి : సీనియర్ నాయకులు యువతకు ప్రాధాన్యత ఇస్తూ సలహాలు ఇవ్వాలని తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాలాయ పల్లి మండల వైసిపి అధ్యక్ష పదవి వెందోటి కార్తీక్ రెడ్డికి ఇచ్చిన సందర్భంగా బాలాయపల్లి మండల వైసిపి నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సీనియర్ నాయకులు గ్రూపు రాజకీ యాలు చేయవద్దని, అందరూ కలిసి 2024 లో పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతేకాకుండా వెసిపి నాయకులు అందరితో కలిసి పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. వెంకటగిరి నియోజకవర్గాన్ని 2024 ఎమ్మెల్యే ఎన్నికల్లో 50 ఓట్లు మెజార్టీతో గెలుపొందేందుకు ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. అనంతరం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, బాలాయపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పల్లంటి రాంబాబు నాయుడు, వైసిపి నాయకులు కాటంబేడు వెంకటరమణ రెడ్డి, రామ్మూర్తి యాదవ్, గోపాల్ యాదవ్, కోనం గుంట సురేష్, వైసిపి నాయకులు రాయి దేవిక చౌదరి, కాటూరు తులసి రెడ్డి కాటూరు ప్రసాద్ రెడ్డి ఎన్ ఆర్ ఐ రాజా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ విద్య అందించడమే లక్ష్యం

- యునైటెడ్ స్టూడెంట్ ఫోరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్నయునైటెడ్ స్టూడెంట్స్ ఫోరం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ధనిక, పేద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరికీ విద్యనందించడమే ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫోరం ప్రధాన లక్ష్యమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు దేగా రవి రాఘవేంద్ర అన్నారు. బుధవారం ఆ ఫోరం కార్యాలయంలో యునైటెడ్ స్టూడెంట్స్ ఫోరంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతల వలన అనేక మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఫోరంలో పనిచేసే విద్యార్థులు విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా విద్యా విధానంలో లోపాలను గుర్తించి ఆయా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి విద్యా విధానంలో సమూల మార్పు కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం చేస్తామన్నారు. అక్టోబర్ 30వ తేదీన గూడూరు షాదీమంజిల్ లో విద్యార్థులకు భారీ అవగాహన సదస్సు నిర్వహిస్తాన్నారు. యునై టెడ్ ఫోరం సభ్యులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని విలువనిచ్చారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు దేగా రవి రాఘవేంద్ర, ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మాకాని వెంకటేశ్వర్లు, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పొట్టేళ్ల పెంచలయ్య యాదవ్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఉద్దాల మణికుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సాంబమ్మ, మండల అధ్యక్షులు కోడూరు వెంకటేశ్వర్లు, నెల్లూరు జిల్లా మైనారిటీ విభాగం ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్, చిట్టమూరు మండలం అధ్యక్షులు శ్రీను, బాబు, ఉద్దాల అయ్యప్ప, ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

రూ.90 లక్షలతో మటన్ ఫిష్ మార్కెట్ ఏర్పాటు: ఎమ్మెల్యే



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రెండు కోట్ల రూపాయల నిధులతో ఆధునిక వసతులతో కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తయిందని మరో 90 లక్షల రూపాయలతో మటన్, ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో నిర్మాణం పూర్తయిన కూరగాయల మార్కెట్ ను ఎమ్మెల్యే వరప్రసాద్ పరిశీలించారు. ప్రహరీ నిర్మాణ పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలో 50 సంవత్సరాల క్రితం నిర్మించిన కూరగాయల మార్కెట్ అధ్వాన స్థితిలో ఉందని ఆ మార్కెట్ ను తొలగించి రెండు కోట్ల రూపాయలతో ఆధునిక వసతులతో నూతన మార్కెట్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఈ ప్రాంతంలోనే మటన్ ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం 90 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైసీపీ పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మురళి, గోపి, మహేంద్ర పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ఆత్మగౌరవం దక్కాలంటే ప్రభుత్వం సాగు భూములు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని రోటరీ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలో జై తులసి రాజన్ లక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు జీవనోపాధి లేకపోవడంతో రాష్ట్రంలో వలసలు పెరుగుతున్నాయని నివారించాలని ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత పేదల ఆత్మగౌరవం దక్కాలంటే ప్రతి పేదవాడికి కోనే రంగారావు భూ కమిటీ సిఫారసులు మేరకు రెండు ఎకరాల సాగుభూమి అందించాలనీ, సిఫారసులో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కత్తి ధర్మయ్య మించల శివకుమార్, రుద్రపాక శ్రీనివాసులు, మోహన్ రెడ్డి ,మహేష్, చంద్ర , మణి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కెఎల్ ఎం రెడ్డి

జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజలందరికీ అందాలి: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ప్రజలందరికీ అందేలా చూడాలని. పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కే ఎల్ ఎం రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు పురపాలక సంఘ పరిధిలో గల పిళ్ళారిపట్టు వార్డు సచివాలయంను మున్సిపల్ కమిషనర్ కె ఎల్ ఎం ఎన్ రెడ్డి. సచివాలయాలను పర్యవేక్షించి, అక్కడి ప్రజలకు పథకాల పై అవగాహన కల్పించి వారిని భాగ్యస్వామ్యులు కావాలని తగు సూచనలు, సలహాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "జగనన్న ఆరోగ్య సురక్ష" పథకంను ప్రజలందరికీ అందించాలని, పుత్తూరు పట్టణంను ఆరోగ్య వంతంగా తీర్చి దిద్దాలని వార్డు, సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో. మున్సిపల్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌సిపురంలో సమగ్ర భూ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి -రామచంద్రపురం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వే ను రామ చంద్ర పురం మండలంలో రెవె న్యూ అధికారులు ప్రారంభించారు. బుధవారం మండలం లోని బ్రాహ్మణ కాలువ గ్రామంలో సమగ్ర భూ సర్వేను మండల సర్వేయర్ హేమ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. భూ సర్వే సందర్భంగా బ్రాహ్మణ కాలువ రెవెన్యూ పరిధిలో రైతులందరినీ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర భూ సర్వే పై అవగాహన కల్పించి, రైతులందరూ ఈ భూ సర్వేకు సహకరించాలని మండల సర్వేయర్ హేమకుమార్ కోరారు. సమగ్ర భూ సర్వే వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సర్వే జరిగిన భూములకు త్వరలో భూహక్కు పట్టా ఇస్తామన్నారు. పొలం వున్న రైతులందరూ వారి ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం ఫొటో, సంబంధిత పత్రాలు రెవెన్యూ సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో వీఆర్వోలు ప్రసాదు, సతీష్, వర్మ, సచివాలయ సర్వేర్లు రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే కుటుంబాలకు రక్ష

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే కుటుంబాలకు రక్షణ కలిగిస్తున్నాయని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఆదినారాయణ పేర్కొన్నారు. బుధవారం ఇన్‌చార్జి ఏపిఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్త్రీ శక్తి భవనంలో బాలాయపల్లి మండల సమాఖ్య 18 వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు కొన్ని లక్షలతో పొదుపు మహిళలను ఆదుకోవడంతో పాటు వారి జీవన అభివృద్ధి మెరుగు పడిందన్నారు. అంతేకాకుండా మహిళలు పొదుపు చేసుకోవడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆ కుటుంబా లకు రక్షణ కల్పిస్తాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో మృత్యుంజయ, పొదుపు సిబ్బంది పాల్గొన్నారు.



వైసిపి జిల్లా బిసి విభాగం ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ ఆచారి

ప్రజాశక్తి -రేణిగుంట : తిరుపతి జిల్లా వైసిపి బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ ఆచారిని నియమిస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్ రెడ్డి నియామక పత్రాన్ని బుధవారం అందించారు. శ్రీకాళహస్తి నియో జక వర్గం రేణిగుంట మండలానికి చెందిన మేదూరు శ్రీనివాసాచారిని తిరుపతి జిల్లా వైసిపి బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎమ్మెల్యే బియపు మధుసూదన్ రెడ్డి నియమించారు.

మండల ఎస్‌సి విభాగం అధ్యక్షుడిగా తోటి మోహన్ బాబు

శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండలం చెందిన తోటి మోహన్ బాబుని రేణిగుంట మండలం ఎస్‌సి విభాగం అధ్యక్షులుగా నియమించారు. ఈ కార్యక్రమం లో తారకరామా నగర్ ఇన్‌చార్జి ఎం శ్రీనివాసులు రెడ్డి, తూకివాకం సర్పంచ్ ముని శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మిలట్రీ స్కూల్స్ కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : 2024-2025 విద్యా సంవత్సరానికి ఎంపిక పరీక్ష ద్వారా 6వ తరగతి(బాల బాలికలకు), 9వ తరగతులకు(బాలురు మాత్రమే) అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో జరగనున్న రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ 18 అక్టోబర్ 2023 అని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధక్షులు, విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ యన్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు వయసును బట్టి 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు చక్కటి అవకాశం వుందని, వివరాల కు 86888 88802 , 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.


పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: సిడిపివో



మాట్లాడుతున్న సిడిపివో మెహబూబీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: పౌష్టికాహారం తోనే ఆరోగ్యం వస్తుందని సిడిపివో మెహబూబీ అన్నారు. గూడూరు రెండో పట్టణంలోని గురుకుల పాఠశాలలో అంగన్‌వాడీ సిడిపిఓ మెహబూ బీ ఆధ్వర్యంలో గర్భిణీలు , బాలింతలకు పౌష్టికా హారం పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టిక ఆహారం తీసుకోకపోవడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కల్పిం చారు. బాల్యవివాహాలు చేయొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ స్వరూపారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయమ్మ హరిత, ఏఎన్ఎమ్ లు , మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ఎంపీడీవోగా పిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న బి.ఇందిరమ్మ వ్యక్తిగత కారణాలవల్ల సెలవు పై అమెరికా వెళ్లడంతో వారి స్థానంలో చిత్తూరు జిల్లా పరిషత్తు ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా పనిచేస్తున్న పి ప్రసాద్‌కు పుత్తూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఆయన అదనపు బాధ్యతలు చేపట్టారు.

కేంద్ర ఎన్నికల సంఘానికి జనసేన కృతజ్ఞతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర జనసేన పార్టీ కి గాజు గ్లాసు గుర్తు కేటాయించడం పట్ల నగరి నియోజకవర్గం జనసేన నాయకులు, కార్య కర్తలు, వీర మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అధినేత కె పవన్ కళ్యాణ్ జనసేన కి గాజు గ్లాసు గుర్తు ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించడం చాలా శుభదినం గా జనసేన నాయ కులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి 2024 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను ఆశీర్వదించాలని కోరారు. పుత్తూరు జనసేన నాయకులు జీ కృష్ణయ్య, కే ఆనందబాబు, శ్రీరామ్ గోపి, కే రమేష్ బాబు, ఉదయ్ యాదవ్, రాజేష్ యాద వ్, బాలురాయల్, ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.

వాలంటీర్లు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు..

గడపగడపకు మన ప్రభుత్వంలో ఫిర్యాదు



ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: తిరుపతి జిల్లా వెంకటగిరి పట్ట ణంలోని బంగారుపేట సచి వాలయ సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తూ వ్యతిరేకం గా పనిచేస్తున్నారని గడప గడపకు మన ప్రభుత్వం లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డికి చేనేత కార్మికుడు నారాయణ ఫిర్యాదు చేశాడు. ఎంతో కాలం గా తాను జగన్‌మోహన్ రెడ్డికి ఓటు వేస్తున్నానని, తనకు రేషన్ కార్డు, పెన్షన్ ఇవ్వనన్నాడని ఫిర్యాదు చేశాడు. 55 సంవత్సరాలు ఉన్న వారికి కూడా పెన్షన్ ఇస్తున్నారని, 63 సంవత్సరాలు వచ్చినా తనకు ఏమీ ఇవ్వడంలేదని నేతన్న నేస్తం ఇవ్వకుండా టిడిపికి చెందిన కొందరికి మగ్గాలు లేకపోయినా ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తు న్నాడన్నారు. నేత కార్మికుడు చెప్పిన మాటలు విన్న రామ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ 'మీరు చెప్పినవన్నీ విన్నాను.. నేను చెప్పేది కూడా విను.. సచివా లయ సిబ్బంది ఏం చేస్తారు? అని అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలి కదా..?' అంటూ సిబ్బందిపై మండి పడ్డారు. ఈ కార్యక్ర మంలో సచివాలయ సిబ్బంది వార్డ్ కౌన్సిలర్ సుబ్బారావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ కోర్సుల దరఖాస్తు గడువు పొడిగింపు

పజాశక్తి - క్యాంపస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, బిఎల్ఐ సి ఎమ్మెల్యే వివిధ డిప్లమా కోర్సులకు చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థిని విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు పొందవచ్చని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల రీజనల్ కోఆర్డినేటర్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వై మల్లికార్జున రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు, పిజీ ఎమ్ఏ, ఎమ్ కాం, ఎమ్మెస్సీ కోర్సులు, బిఎల్ఐసి, ఎం ఎల్ ఐ సి, ఎస్సిఎ, ఎంబిఏ, డిప్లమా కోర్సులు పి జి డబ్ల్యూ డి డబ్ల్యూ ఎస్, పి జి డి సి హెచ్ టి కోర్సులను ఆఫర్ చేస్తుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వెబ్‌సైట్‌లో ఈనెల 30వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను పూర్తి చేసి హార్డ్ కాపీలను ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యయన కేంద్రంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 7382929617 చరవాణి నెంబర్ కు సంప్రదించాలని కోరారు.